# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 17 జనవరి 2026


## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 16 ప్రభాతవార్త



విశేషాలంకరణలో అమ్మవారు

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద ఆలయ అర్చకులు, పండితులు గోవర్ధనశర్మల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. పలమనేరు నవీన్‌కుమార్ అతని మిత్రబృందం అన్నదానానికి కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అర్చక, అధికార, సిబ్బంది సేవలందించారు.

## ఘనంగా చిట్లాకుప్ప ఉత్సవం

### ఉత్సాహభరితంగా పశువుల పండుగ

పీలేరు జనవరి 16 ప్రభాతవార్త:

పీలేరు పట్టణంలో కట్టుకాల్వ పరిధిలో ఉన్న శ్రీనాథపురం కాలనీలో శుక్రవారం సాయంత్రం పశువుల పండుగను వారసత్వంగా సాంప్రదాయకంగా పోతంశెట్టి , శ్రీరామ, శ్రీకృష్ణం వంశస్థుల నిర్వహణలో నిర్వహించారు. కాటమరాయుడు కు మేళతాళాలతో పూజలు నిర్వహించారు. పోతంశెట్టి కుటుంబీకులు చిట్లాకుప్పకు నిప్పు అంటించి పశువుల చే ప్రదక్షిణలు చేయించారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టి ప్రభాకర పోతంశెట్టి రమేష్ సుధాకర బాబు సునీల్ మాజీ ఉపసర్పంచ్ శ్రీరామ సుధాకర, కనకరాజ్, చందు, రమేష్, పోతంశెట్టి, చేతన్ మనోజ్ఞ సాయి వి రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం రహత్ భాష. తదితరులు పాల్గొన్నారు.



# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

- ఊరురా పండుగే... పండుగ...
- చిట్లా కుప్పల వద్ద జనమే... జనం ...
- గొబ్బెమ్మ గ్రామోత్సవాల్లో మహిళల సందడి
- గోమాతకు పూజలు చేసిన మహిళలు
- ఒంటిమిట్టలో వైభవంగా పారువేట ఉత్సవాలు
- తాళ్లపాకలో ఘనంగా గ్రామోత్సవం













రాజంపేట, జనవరి 16 ప్రభాతవార్త

సంక్రాంతి ,కనుమ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఊరురా సంక్రాంతి సంబరాలు హోరొచ్చాయి. గ్రామాలకు నిజమైన పండుగ అంటే సంక్రాంతి అని చెప్పనవసరం లేదు. గ్రామ సీమలు మూడు రోజుల ముచ్చటైన పండుగకు కళకళలాడాయి. కోడి పందాలు, హరిదాసు సంకీర్తనలు, గొబ్బెమ్మల ఉత్సవాలు, పారువేట ఉత్సవాలు, చివరి రోజు శుక్రవారం పశువుల ఊరేగింపు, చిట్లాకు పశువుల ఉన్యాసాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. కనుమ రోజు చెయ్యేరు నది ప్రజలతో సంక్రాంతి సంబరాలతో నిండిపోయింది. వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి స్వగ్రామమైన నందలూరు మండలం చెన్నయ్య గారి పల్లెలో సంక్రాంతి సంబరాలలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఒంటిమిట్టలో కోదండ రామాలయం ఉత్సవాలలో భాగంగా పారువేట ఉత్సవం ఘనంగా జరిగింది. పద కవితా పితామహుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో చెన్నకేశవ, సిద్దేశ్వర స్వామి పార్వేట ఉత్సవాలు, గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్లు వారి వారి దేవేరులతో వేరువేరు పల్లకీలలో ఊరేగుతూ పారువేట సాగించారు. అనంతరం స్వామివార్లు గ్రామంలోని మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు. శంఖ, చక్ర, గద, విల్లు, ఖడ్గాలతో స్వామి పారు వేటకు వెళ్లి క్రూర మృగాలను సంహరిస్తాడనే విషయం బయటకు తెలిసినప్పటికీ, మనుషులలో ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనే అరిషడ్వర్గాలను వేటాడడం కోసం స్వామివార్లు బయలుదేరుతారనే అంతరార్థం అందులో ఇమిడి ఉందని టీటీడీ ధర్మచార్యులు గంగనపల్లి వెంకటరమణ సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ, గ్రామ సర్పంచ్ శ్యామన బోయిన గౌరీ శంకర్, ఉపన్యాసకురాలు బొమ్మ రామ సుబ్బమ్మ, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు రాజంపేట, రాయచోటి, పీలేరు ,మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో కనుమ రోజు సాయంత్రం జరిగే చిట్లాకుప్పల సందడి అంబరాన్ని అంటాయి. రాయచోటిలో వేలాదిగా ప్రజలు తరలివచ్చారు.

# ఊరంతా ఘనంగా సంక్రాంతి సంబరాలు



గోవుకు అలంకరించిన దృశ్యం



అలంకరణలో పాడి ఆవులు



చిట్లాకుప్పకు నిప్పుపెట్టిన దృశ్యం

మదనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త :

సంక్రాంతి పండుగ సంబరాలను హిందువులు బుధ, గురు, శుక్రవారం మూడు రోజులు పాటు ఘనంగా జరుపుకొన్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో వేకువజామునే ఆడపడుచులు ఇంటిముందు గొబ్బెమ్మలు పెట్టి రంగురంగుల ముగ్గులను వేశారు. ఉపవాసాలు ఉండి పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వేకువజామున బోగిమంటలు వేసుకొన్నారు. గురువారం ఉపవాసాలతో ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించారు. అదే రోజు మహిళలు ప్రత్యేకంగా పొయ్యిలు ఏర్పాటు చేసి పాలు పొంగించి తీపి పొంగళ్ళు చేశారు. పొంగళ్ళను అందరికి పంచిపెట్టారు. పలు రకాల పిండి వంటలను వండి ఆరగించారు. పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను రంగులతో కొమ్ములను అలంకరించి, బుడ్డలు కట్టారు. గ్రామం పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళారు. సాయంత్రం కాటంరాజు గుడికి తీసుకెళ్ళి అక్కడ చిట్లాకుప్పలు వేసి రగులుతున్న అగ్గి చుట్టూ ఆవులను తిప్పారు. స్థానిక పూజారులు హాజరైన వారికి ప్రసాదాలు పంచిపెట్టారు. ఆవులు, ఎద్దులు రోగాలు రాకుండా తీర్థాలు, వేప పిండితో తయారు చేసిన అన్నం ముద్దను పంచిపెట్టారు. అనంతరం అక్కడ పూజలు నిర్వహించుకొని ఇంటికి చేరుకొని అలంకరణలో ఉన్న పశువులను గాటిల్లో కట్టి పచ్చిమేత వేశారు. పితికిపప్పుకూర, దోసెలు వండి రుచురుచులతో తిన్నారు. శాఖాహారం కూడా వండి తిన్నారు. మహిళలు గొబ్బియాల్లో..గొబ్బియాల్లో అంటూ ఇంటింటా వెళ్ళి దానధర్మాలు చేయాలని పాటలు పాడారు. డూడూ బసవన్నను అక్కడక్కడా తిప్పారు. పలు గ్రామాల్లో ఈ పండగ అత్యంత వైభవంగా నిర్వహించుకొన్నారు. శ్రీవారినగర్‌లోని గోవర్ధనగిరి వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను ఘనంగాజరుపుకొన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా చిట్లాకుప్పను పేర్చి నిప్పుపెట్టి ఆవులను చిట్లా కుప్ప చుట్టూ ప్రదక్షణలు చేయించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 16 గ్రామాల పార్వేటకు బయలుదేరిన మాధవుడు

## పార్వేట ఉత్సవంలో స్వామివారిని చూసి పులకరించిన భక్తజనం.

మైదుకూరు, జనవరి 16, ప్రభాతవార్త:

మైదుకూరు దైవం మా ఊరి మాధవ సంక్రాంతి కనుమ పార్వేట ఉత్సవంలో శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ మాధవరాయ స్వామి శ్రీదేవి భూదేవి సమేత వారిని దర్శించుకుని భక్త జన సందేహం పులకించిపోయారు. సంక్రాంతి మొదలుకొని పాతూరు గ్రామంలో ప్రజలకు హనుమ వాహనంపై దర్శనం ఇచ్చి పురవీధుల్లో ఆయనకు హారతులతో ప్రజలు కాయ కర్పూరం సమర్పించారు. అనంతరం కనుమ మూడవ రోజు 16 గ్రామాల పార్వేటకు బయలుదేరిన శ్రీశ్రీశ్రీ మాధవరాయ స్వామి నంద్యాల రోడ్డులో రాష్ట్ర నలుమూల నుంచి వచ్చిన భక్తులకు దర్శనం ఇవ్వడంతో రాయలసీమ నడిబొడ్డు శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ జన సందేహం మధ్య నిండిపోయింది. స్వామి వారి పార్వేట ఉత్సవంలో కేరళ బ్యాండ్, బృందావనం నాట్యం, కోలాటం, చెక్కభజన తో స్వామి వారి భక్తులను అలరించారు. సంక్రాంతికి సిరిలెన్నెన్నో తెచ్చింది. రాయల సీమ రాయలోరి రత్నాలు ఎన్నో తెచ్చింది. మాధవరాయ స్వామి సంక్రాంతి తిరుణాల తెచ్చింది. మైదుకూరు దైవమా మా ఊరి మాధవ పాటలతో మారుమోగిన మైదుకూరు శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ నాలుగు రోడ్లు, పార్వేట ఉత్సవాన్ని తిలకించడానికి స్వామి వారి 16 గ్రామాల ప్రజలతో పాటు సంక్రాంతి పండుగకు వచ్చిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, మహిళలు, యువత కేరింతలతో సంక్రాంతి పండుగ సందడితో శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ దారి పొడవునా మిద్దెలపై జన సందేహం. కొత్త అల్లుళ్లతో, యువతతో ఉత్సాహభరితంగా దారి పొడవునా కొనసాగింది. పట్టణవాసులు మాధవరాయ స్వామి పార్వేట ఉత్సవంలో దారి పొడవునా స్వామి వారిని దర్శించుకుంటూ టెంకాయలు సమర్పించి హారతి తీసుకున్నారు. భక్తులకు పూజారులు హారతితో పాటు స్వామివారి దర్శనం కలిగించారు. స్వామివారిని చూడడానికి పెద్ద ఎత్తున పోటీపడిన భక్తులు, యువత మహిళలు కుటుంబ సభ్యులు, అందరూ పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ మాధవ ఆంజనేయ భీమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బెల్లం.సుబ్బరాయుడు ఉత్సవంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలతో సి.ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మైదుకూరు పట్టణ పెద్దలు, ప్రముఖులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### శ్రీశ్రీశ్రీ మాధవరాయ స్వామి ప్రాముఖ్యత,

జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన గండికోట పినాకినీ నదీ తీరం ప్రక్కన ఉన్న గండికోట దుర్గంలో ఉన్న మాధవరాయ స్వామి గండికోటను రాజులు పాలించే కాలంలో శత్రువు రాజులు గండికోటపై దండయాత్ర చేశారని, ఆలయం పై దాడి చేసి ఆలయ సంపదను దోచుకునేందుకు గర్భగుడిలో ప్రవేశించి ఆలయ ద్వారాలు పగలగొట్టేందుకు ప్రయత్నించారని ఆ దారుణాలను శ్రీ లక్ష్మీ మాధవరాయ స్వామి చూడలేక గర్భగుడి వెనుక భాగమున రంధ్రం చేసుకొని ఆ రంధ్రం గుండా బయటికి వచ్చి మాండవ్య క్షేత్రమైన మైదుకూరులోని ఒక సెలిమె లో వెలిచారట. ఆ చెలిమి ఇప్పుడు మైదుకూరులోని పాత ఊరులోని పెద్దబావి. ఈ సొరంగంమార్గం గండికోట దుర్గం నుంచి ఇప్పటికీ ఉన్నదని ఇక్కడ ఆ రోజుల్లో ఆ సెలిమె పరిసర ప్రాంతమంతా అరణ్య ప్రాంతాన్ని తలపించేలా ఉండేదట ఒక మేకల కాపరి మేకలు తోలుకొని వచ్చి మేపుచుండేవాడట ఒక మేక ఆ సెలిమె దగ్గర ఉన్న పచ్చి గడ్డి, ఆకులు మేదం కోసం వచ్చి దాహం తీర్చుకునేదట అక్కడే శ్రీ మాధవరాయ స్వామికి పాలు సమర్పించుకునేదట అది చూసిన ఆ యజమాని ఆగ్రహంతో దుడ్డు కర్రతో మేకను కొట్టబోయే సమయంలో ఆ కర్ర దెబ్బ స్వామికే తగిలిందంట. ఆ దెబ్బతో స్వామికి తలకు గాయం అయింది. ఆ గాయం మచ్చ స్వామి వారి నుదుటి పై ఇప్పటికీ మనం గమనించవచ్చు, అప్పుడు స్వామి గండికోట నుంచి వచ్చిన మాధరాయ స్వామిని అన్నట్లుగా కొన్ని మాటలు వినపడినావట. ఈ విషయం ఊరంతా వ్యాపించి స్వామి వారి విగ్రహాన్ని బయటకు తీసి ఆలయంలో ప్రతిష్ట చేసి ధనుర్మాసంలో ఉత్తర ద్వారం ద్వారా పెద్ద బావి నీళ్లతో అభిషేకం చేసే వారట, అలా మైదుకూరులోని ప్రజలకు కోరుకున్న కోరికలు తీరుస్తూ ఇక్కడ ప్రజలకు అనుగ్రహిస్తూ మహా సంక్రాంతి సందర్భంగా ఆయన ఫార్వేట ఉత్సవంలో భక్తులకు అభయమిస్తూ అంగరంగ వైభవంగా పార్వేట ఉత్సవంతో పాటు మైదుకూరు పరిసరాల గ్రామాలకు బయలుదేరడం ఆనవాయితీగా జరుగుతుంది.









## "మీకు రూ. 5,000 నగదు వచ్చింది"

# అనే మెసేజ్ నమ్మకండి



రాయచోటి టౌన్ జనవరి 16 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ వేళ అమాయక ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. "ఫోన్ పే ద్వారా మీకు 5000 రూపాయల నగదు బహుమతి వచ్చింది" అంటూ సోషల్ మీడియాలో వస్తున్న లింకుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఐపీఎస్ హెచ్చరించారు. ఈ మోసపూరిత లింకులపై ఎస్పీ మాట్లాడుతూ ఆ లింక్ క్లిక్ చేస్తే మీ ఖాతా ఖాళీ వాట్సాప్ గ్రూపుల్లో "పొంగల్ గిఫ్ట్ వోచర్ క్లెయిమ్ చేయండి" లేదా "క్యాష్ బ్యాక్ రివార్డ్" పేరుతో వస్తున్న మెసేజ్‌లు వందకు వంద శాతం నకిలీవి. ఆ లింకులను క్లిక్ చేయడం వల్ల మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. మీ బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు జమ కావడానికి మీరు ఎప్పుడూ యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేదు. ఎవరైనా పిన్ అడిగితే అది మోసమని గ్రహించండి. రివార్డులు ఏవైనా ఉంటే నేరుగా ఫోన్ పే లేదా గూగుల్ పే యాప్‌లోనే కనిపిస్తాయి. వాట్సాప్ మెసేజ్ ద్వారా ఎటువంటి రివార్డులు రావు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ఇతరులకు పంపి వారిని ఇబ్బందుల్లోకి నెట్టవద్దు. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇలాంటి లింకులు క్లిక్ చేసి నగదు నష్టపోయినట్లయితే, మొదటి గంట లోపే స్పందించడం ముఖ్యం. వెంటనే 1930 అనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. "మీ అప్రమత్తతే మీ సొమ్ముకు రక్ష. అపరిచిత లింకుల పట్ల జాగ్రత్తగా ఉండండి." అని ఎస్పీ పేర్కొన్నారు.

## విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై

# ఈ నెల 20 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

### ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి

కడప , జనవరి 16 ప్రభాతవార్త



విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్సీ) ఈనెల 20వ తేదీ నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026, 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఈఆర్సీ చైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి అధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలులో నిర్వహించనున్న ట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) పై ఈనెల 20వ తేదీన తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ, 27న కర్నూలులోని ఏపీఈఆర్సి కార్యాలయంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్కో, ఏపీజెన్కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసిపిడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి రోజూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్ కు సంబంధించిన ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తారని వివరించారు. అభిప్రాయాలు తెలియజేయదలుచుకున్న వారు నేరుగా ఆయా వేదికల వద్ద పాల్గొనవచ్చని, నేరుగా పాల్గొనలేని వారికోసం రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోనివారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలను తెలియచేయవచ్చన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్షప్రసారం చేయనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

## కాటేసిన పాముతో ఆస్పత్రికి వచ్చి బాధితుడు

మదనపల్లె క్రైమ్, జనవరి 16 ప్రభాతవార్త.



సాధారణంగా పాము కనిపిస్తేనే ఆమడ దూరం పరుగెడుతుంటాం. అలాంటిది తనను కాటేసిన పామును చంపడమే కాకుండా, దాన్ని చేత్తో పట్టుకుని నేరుగా ఆస్పత్రికి వచ్చిన సంఘటన శుక్రవారం మదనపల్లి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం యనమలవారి పల్లికి చెందిన మోలా (40) పొరుగు ఇంట్లోకి గురువారం రాత్రి ఒక పాము రాగా, భయాందోళనకు గురైన ఆ ఇంటి ఉన్న వారు పామును పట్టుకోవాల్సిందిగా మోలాను పిలిచారు. సహాయం చేయడానికి వెళ్లిన మోలా ఆ పామును చంపడానికి ప్రయత్నిస్తుండగా, అది ఒక్కసారిగా అతని చేతిపై కాటు వేసింది. అయితే మోలా ఏమాత్రం భయపడకుండా, వెంటనే ఆ పామును అక్కడికక్కడే కొట్టి చంపేశాడు. పాము కుట్టినప్పుడు కంగారు పడకుండా మోలా సమయస్ఫూర్తితో తనని కుట్టిన పాము ఏ రకానికి చెందినదో తెలిస్తే వైద్యులకు చికిత్స చేయడం సులభం అవుతుందని భావించి, ఆ చచ్చిన పామును పట్టుకుని నేరుగా మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. చేతిలో చచ్చిన పాముతో మోలా ఆస్పత్రిలోకి రావడం చూసి రోగులు, సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. బాధితుడి పరిస్థితిని గమనించిన వైద్యులు స్పందించి అతనికి అత్యవసర చికిత్స అందించారు. ప్రస్తుతం మోలా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## అంగళ్ళు ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం

### దంపతులకు తీవ్ర గాయాలు

మదనపల్లె క్రైమ్, జనవరి 16 ప్రభాతవార్త.

కురబలకోట మండల పరిధిలోని అంగళ్ళు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముదివేడు యనమలవారిపల్లికి చెందిన మధు (30), మాధవి (25) దంపతులు తమ వ్యక్తిగత పనుల నిమిత్తం మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి తమ స్వగ్రామానికి స్కూటర్‌పై వెళ్తుండగా అంగళ్ళు రైల్వే ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే, స్కూటర్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మధు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఆయనను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించాలని డాక్టర్లు సూచించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘర్షణ ముగ్గురికి తీవ్ర గాయాలు

### కడప రిమ్స్‌కు తరలింపు

వీరపునాయునిపల్లి జనవరి16, ప్రభాతవార్త.





మండలంలోని రాజుపాలెం గ్రామం నందు శుక్రవారం ఉదయం కాసువు విషయమై ఘర్షణ జరిగే ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు వీఎన్పల్లి ఎస్సై మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపాలెం గ్రామానికి చెందిన నాగార్జున, మహానంది, మాధవలపై ఇదే గ్రామానికి చెందిన మస్తాన్, దస్తగిరి, బ్రహ్మయ్య లో దాడి చేయడంతో వీరికి గాయాలైనట్లు ఆయన తెలిపారు ఈ విషయమై ఇరువురు దాడి చేసుకున్నట్లు ఆయన తెలిపారు ఇరువురు బై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు తీవ్రంగా గాయపడిన వారిని కడప రిమ్స్ కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

సంబేపల్లి జనవరి 16 ప్రభాతవార్త

సంబేపల్లే మండల పరిధిలో పి ఎన్ కాలనీ గ్రామం మినమరెడ్డిగారిపల్లి, దేవపట్ల గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న 8 మందిని ,4 పుంజులను అదుపులోకి తీసుకొని రూ.3350 / కూడా నగదును స్వాధీనం చేసుకొన్నట్లు సంభేపల్లె ఎస్ ఐ రవి కుమార్ తెలిపారు.

## ముసల్‌రెడ్డిపల్లెలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

**పులివెందుల, జనవరి 16 , ప్రభాతవార్త :**
నియోజకవర్గంలోనీ సింహాద్రిపురం మండల పరిధిలోని ముసల్‌రెడ్డిపల్లె గ్రామంలో ఈ కార్యక్రమంలో భాగంగా వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘు నాథరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపా రు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా 'పల్లె పండుగ' వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. అజ్జుగు ట్టు రఘునాథరెడ్డి పర్యవే క్షణలో ముసల్‌రెడ్డిపల్లె గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సింగం రెడ్డి అమర్నాథ్ రెడ్డిని బీటెక్ రవి వారి స్వగృహంలో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి, త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, తొండూరు మండల టీడీపీ పరిశీలకుడు మారెడ్డి భరత్‌రెడ్డి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యక ర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరామ మహా శోభాయాత్ర జయప్రదం చేయండి



**కడప కార్పొరేషన్ జనవరి 16 ప్రభాతవార్త:**
విశ్వహిందూ పరిషత్, కడప అయోధ్య వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామ కళ్యాణం, శ్రీరామ మహా శోభాయాత్రలను శాంతియుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖ అధికారులను ఆదేశించారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జిల్లా అధికారులు, వి హెచ్ పి, కడప అయోధ్య వేదిక నిర్వహణతో కలిసి ఈనెల 21, 22 సీతారాముల కళ్యాణం శ్రీరామ మహా శోభాయాత్ర నిర్వహణపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఆర్డిఓ జాన్ ఆర్విన్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు నందారపు చెన్న కృష్ణారెడ్డి, అయోధ్య ఐక్యవేదిక నిర్వాహకులు వెంకట్ రెడ్డి, బండారు శివకేశవ, లక్ష్మీనారాయణ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సూర్యనారాయణ, రమణ, టిడిపి నేత శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా కనుమ పండుగ

**సంబేపల్లి జనవరి 16 ప్రభాతవార్త:**



సంక్రాంతిలో భాగమైన కనుమ పండుగ ను మండల వ్యాప్తంగా అంగరంగ వైభవంగా ప్రజలు జరుపుకున్నారు. కనుమ పండుగ సందర్భంగా రైతులు వారి పశుసంపదను వాటికి స్నానం ఆచరించి సుందరాతి సుందరంగా అలంకరించి చిట్ల కుప్ప ప్రాంతాలకు తీసుకొచ్చారు అక్కడ రైతు కుటుంబాలు వారి పశుసంపద వృద్ధి చెంది పాడి పంటలు బాగా పండాలని కాటమరాజుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు అనంతరం చన్నీటి స్నానం ఆచరించి వచ్చిన యువకుడు చిట్లకుప్పకు నిప్పు పెట్టడానికి వెళ్లేటప్పుడు బియ్యం బెల్లం తో వండిన వేడివేడి ప్రసాదంతో యువకుడి వీపుపై వేయడంతో ఆ యువకుడు చిట్ల కుప్పకు నిప్పు పెట్టాడు చిట్లాకుపలో గుమ్మడికాయలో కాలే మంటలు వేశారు అనంతరం రైతులు పశువులను చిట్ల కుప్ప చుట్టూ ప్రదక్షణలో చేయించారు. నిర్వాహకులు వచ్చిన వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## టక్కోలు బీసీకాలనీ స్మశానకు దారి ఏర్పాటు

**సిద్దవటం జనవరి 16 ప్రభాతవార్త:**



టక్కోలు గ్రామ బీసీ కాలనీ వాసులకు ఎన్నో సంవత్సరాలుగా ఉన్న స్మశానానికి వెళ్లే దారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి తమసొంత నిధులతో స్మశానానికి వెళ్లే దారికి అవసరమైన భూమిని కొనుగోలు చేసి, చట్టబద్ధంగా అగ్రిమెంట్ పూర్తి చేసి, అగ్రిమెంట్ పత్రాలను బీసీ కాలనీ వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగమునిరెడ్డి మాట్లాడుతూ, త్వరలోనే స్మశానానికి వెళ్లే రోడ్డు కూడా వేయిస్తానని బీసీ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సమస్యకు పరిష్కారం అందించిన కూటమి ప్రభుత్వానికి బీసీ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో చిన్నపరెడ్డి రమణారెడ్డి శంకర్ యాదవ్ శివ జయసూర్యరెడ్డి ధర్మసేనారెడ్డి ఆవుల బుజ్జి ఓబుల్ రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సంక్రాంతి ఉత్సవాలు

**పెద్దమండెం జనవరి 16 ప్రభాతవార్త**



మండలంలో గత మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు భోగి మకర సంక్రాంతి కనుమ ఉత్సవాల్లో ప్రజలు సంతోషంగా పాల్గొని సంబరాలను జరుపుకున్నట్లు మండల తెలుగుదేశం నాయకులు బీటెక్ సుమన్ అన్నారు. మకర సంక్రాంతి రోజు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు అందులో గెలుపొందిన వారికి బహుమతులను సుమన్ ప్రధానం చేశారు. అందరి ఇండ్లలో సిరిసంపదలతో సంతోషాలతో కలిసిమెలిసి జీవించాలని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని వాటి సమస్యలను సత్వరమే పరిష్కరిం చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామసులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరీ అమ్మవారికి మొక్కులు

**గాలివీడు, జనవరి 16(ప్రభాతవార్త):**
మండలంలోని పూలికుంట గ్రామ దేవతగా వెలసిన శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఉషా దంపతులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. గురువారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 101 టెంకాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథిరెడ్డి, సులోచనమ్మ దంపతులు, చరణ్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు కొండారెడ్డి, నాగేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, రామాంజులురెడ్డి, టోపీవలి పాల్గొన్నారు.



# అమ్మవారి శాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు





**బద్వేల్ అర్బన్. జనవరి. 16. ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలో అమ్మవారిశాలలో సంక్రాంతి వేడుకలను ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరీ ఉరిమీ శ్రీనివాసులు మరియు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, అలాగే వాసవి దీక్ష పరులు ఆధ్వర్యంలో కన్యకల పూజను నిర్వహించి 10 ఏళ్ల లోపు ఉండే కన్యకులకు 51 కలశాల తో, చిన్నపిల్లలకు కానుకలు 18 రకాల బహుమతులు ఇచ్చి వారికి అమ్మవారి అనుగ్రహం కలగాలని వారు కోరారు . అనంతరం గురు వాసవి చందు మాట్లాడుతూ కన్యకల పూజలను ఘనంగా నిర్వహించి పిల్లవారని మనస్ఫూర్తిగా ఆశీర్వదించి చిన్నపిల్లవారు అమ్మవారితో సమానమని వారు పేర్కొన్నారు.అనంతరం 350 మందికి అల్పాహారాన్ని నిర్వహించారు,ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, మాజీ అధ్యక్షురాలు చింత కుంట ధనలక్ష్మి, తులసి వరలక్ష్మి, వాసవి వనిత క్లబ్ సభ్యులు బచ్చు పార్వతమ్మ, తో పాటు గురు వాసవి గోనుగుంట్ల చందు, గూడూరు ఓబయ్య ,కొలిశెట్టి సుబ్రహ్మణ్యం, గోనుగుంట్ల అఖిల్, ఎడ్లపల్లి సాయికిరణ్, మాలపాటి శివ, మాలపాటి మనోజ్, తులసి సుబ్రహ్మణ్యం, పలువురు వాసవి దీక్షాపరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేసిన నేతలు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే



పోలిలో పేదలకు వస్త్రాలు అందజేస్తున్న పోలి సుబ్బారెడ్డి

**రాజంపేట, జనవరి 16 ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ సందర్భంగా రాజంపేట మండలంలో నాయకులు తమ దాతృత్వాన్ని దాటుకున్నారు. వారి స్వగ్రామాల్లో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు సంక్రాంతి పండుగ సందర్భంగా మేకావారిపల్లె వారిగ్రామంలో ప్రజలందరూ పండుకు బాగా జరుపుకోవాలని ఉద్దేశంతో కుటుంబీకులు, గ్రామస్తులతో చీరలు పంపిణీ చేస్తూ, గ్రామ కాలనీవాసులు అందరికీ ఆర్థిక సహాయం అందించారు. మకర సంక్రాంతి సందర్భంగా రాజంపేట నియోజవర్గ టిడిపి సీనియర్ నాయకులు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు ఆయన స్వగ్రామమైన చిన్నెల్లుగారిపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున హాజరైన మహిళలకు పురుషులకు చీరలు, పంచలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజంపేట జనసేన పార్లమెంట్ కన్వీనర్ ఎల్లటూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, సిద్ధవటం మండలం మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి ఏల్లటూరు శివరావరాజు శ్రీనివాస నాయుడు, ప్రతాప్ నాయుడు, కృష్ణారెడ్డి ఎంపిటిసి చుక్కయానాది, రాజంపేట మైనార్టీ నాయకుడు గుల్జార్ భాష, నియోజకవర్గ పరిధిలోని సిద్ధవటం ఒంటిమిట్ట నందలూరు రాజంపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు, పాల్గొన్నారు. ఆకేపాడు గ్రామంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, సోదరుడు అనిల్ కుమార్ రెడ్డి పేదలకు కుటుంబ సభ్యులతో కలిసి వస్త్రాలను అందజేశారు. అలాగే దివంగత టిడిపి నేత ఆకేపాటి గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆకేపాటి రంగారెడ్డి, ఆకే పార్టీ మురళి పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

## పండగ పూట కూడా పస్తులేనా



చెత్త శుభ్రం చేస్తున్న దృశ్యం

**పీలేరు జనవరి 16 ప్రభాతవార్త:**
ఆంధ్ర రాష్ట్రంలో అతిపెద్ద పండుగ తెలుగువారికి ప్రీతికరమైన సంక్రాంతి పండగ, అలాంటి పండగ గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులకు ఆవేదన మిగిల్చింది. సంక్రాంతి పండగపూట కూడా వేతనాలు లేక ప్రజలకు శ్రేయస్సు కోసం కడుపులు కాల్చుకుంటూ తమ కుటుంబాలను పస్తులతో ఉన్న ప్రజలందరు సంతోషంగా ఉండాలని పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులు సేవ చేస్తున్న జిల్లా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని కార్మికులకు కనికరం లేకుండా ప్రజలకు సేవ చేయాలని ఆదేశాలు ఇస్తారు తప్ప తింటున్నారా లేదా అనే వారు ఎవరూ లేరు కార్మికులకు కూడా ఇలాంటి పండుకు కూడా వేతనాలు లేక మూడు పూటలా తినడానికి తిండి లేక జీతాలు లేక పస్తులతో పని చేయించుకుంటున్నారు. అన్నమయ్య జిల్లాలో జిల్లా పంచాయతీ అధికారి వారికి అన్నమయ్య జిల్లా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీ తరఫున వేతనాలు చెల్లించాలని రాతపూర్వకముగా ఎన్ని మెమొరాండాలు ఇచ్చిన జిల్లా పంచాయతీ అధికారి స్పందించలేదు ఈ సమస్య రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నది కావున రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి తప్ప వేరే మార్గాలు లేవు అని వారి ద్వారా సమాచారం ఇచ్చారు ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు పేర్కొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

**రాజుపాళెం, జనవరి 16, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో గల శ్రీ సోమేశ్వర స్వామి, వేణు గోపాల స్వామి మరియు కొర్రపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి పారువేట ఉత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రీ సోమేశ్వర స్వామి గంగా, గౌరీ సమేతంగా, శ్రీ మదన వేణుగోపాలస్వామి రుక్మిణి సత్యభామల సమేతంగా, శ్రీ లక్ష్మీ కంబగిరి స్వామి శ్రీలక్ష్మీదేవి, శ్రీ సద్దలక్కమ్మ సమేతంగా పార్వేట ఉత్సవ కార్యక్రమాలు పెద్ద ఊరేగింపుగా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. రైతులు సాగు చేసిన పంటలన్నీ కోతకు వచ్చి ధాన్య లక్ష్మి రైతన్న ఇళ్లకు చేరే సమయంలో వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి కనుక గ్రామ గ్రామాన ఈ పర్వదినం పురస్కరించుకొని భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు తెలుగు సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట బంధు మిత్రులతో ఆనంద ఉత్సాహాలతో కొత్త సంబరాలు వెళ్ళు విరిసాయి. మహిళలు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులతో, చిన్నపిల్లల గాలిపటాల ఎగురవేయడం, ఆటపాటలతో ఎంతో సందడిగా సంక్రాంతి పండుగ సాగినది. పార్వేట ఉత్సవ కార్యక్రమాలలో ఈవో శ్రీధర్, జయన్న, శంకర్ రెడ్డి, సంజీవరెడ్డి, అమీర్ భాష, విశ్వనాథ రెడ్డి, రంగేశ్ రెడ్డి పలువురు నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## సాంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు

**గాలివీడు, జనవరి 16(ప్రభాతవార్త):**
సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా గాలివీడు మండల వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండుగలు ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం, శుక్రవారం గ్రామాల్లో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. బంధువులతో కలిసి ఇంటింటా పిండివంటలు, రంగవల్లులు, గంగిరెద్దులు, గాలిపటాలతో చిన్నా పెద్దా ఆనందోత్సాహాలతో సందడి చేశారు. పట్టణాల నుంచి సొంత ఊర్లకు వచ్చిన యువతీ యువకులు సంప్రదాయ వస్త్రధారణలో మిత్రులు, బంధువులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పండుగను ఆనందంగా గడిపారు. గ్రామీణ జీవనశైలి ప్రతిబింబించేలా ప్రతి ఇంటి ముందూ రంగు రంగుల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కనుమ సందర్భంగా రైతులు తమ పశువులను అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చిట్లాకుప్పల చుట్టూ పశువులతో ప్రదక్షిణలు చేయిస్తూ సంప్రదాయ రీతుల్లో కనుమ వేడుకలను జరుపుకున్నారు.



## మారుతున్న రాజకీయ సమీకరణాలు



బీటెక్ రవి సమక్షంలో టీడీపీ లోకి చేరిన జగదీష్

**పులివెందుల, జనవరి 16, ప్రభాతవార్త :**
నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రోజు రోజుకు టీడీపీ బలోపేతం అవుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకొండప్ప కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి (ఎర్ర జగదీష్) తన అనుచరులతో పాటు సుమారు 50 కుటుంబాలతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి జగదీశ్వర్ రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, ప్రజావ్యతిరేక విధానాలతో వైసీపీపై ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే తెలుగుదేశం పార్టీ వైపు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. జగదీశ్వర్‌రెడ్డి వంటి నాయకుల చేరికతో పులివెందులలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని, అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. పులివెందుల అభివృద్ధి కోసం టీడీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల ఇంచార్జి మారెడ్డి జయ భరత్ రెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, వాణిజ్య విభాగపు కార్యదర్శి నల్లగారి భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కాంబల్లె గంగాధర్‌రెడ్డి, సంజీవులు, శ్రీను, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నరసింహస్వామి వారి గ్రామోత్సవం

**పులివెందుల , జనవరి 16 , ప్రభాత వార్త :**
పులివెందుల పట్టణ పరిధిలోని వాసవి కాలనీలో శుక్రవారం శ్రీ నరసింహ స్వామి వారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా శ్రీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే డిజె సాంగ్స్ అదుర్స్ అనిపించాయి. ఇక సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించే సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవి మాత గ్రామోత్సవం కాలనీలోని నలుదిశల సాగింది. ఏడాది పొడవునా ఆపదల నుంచి గట్టెక్కించాలని, ఆయురారోగ్యాలతో పాటు భోగ భాగ్యాలు ప్రసాదించాలని భక్తులు నరసింహస్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, మిట్ట శ్రీహరి, జూటూరు నాగ సుగుణాకర్ రావు, పుల్లగూర సుధా, పుల్లగూర బాబు, మిట్ట కరుణాకర్, రెండో వార్డ్ కౌన్సిలర్ మిట్ట గంగా లక్ష్మి, దొంతు రవిశంకర్, మిట్ట వెంకటేశ్వర ప్రసాద్, మిట్ట రామ్మోహన్, దిండుకుర్తి నాగభూషణం, సుంకు రామచంద్ర, మిట్ట వెంకటసుబ్బయ్య, పబ్బతి సంతోష్, పత్తిసోము దొంత మురళి, బచ్చు ఆంజనేయులు తల్లం లోకేష్ జేఎస్టీయూ రాజేష్ పందిళ్ళపల్లి నారాయణరెడ్డి, పాత్రికేయులు వాసవి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## సేవే సంకల్పంగా మేఐహెల్ప్యూ ఫౌండేషన్..

**ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 16 ప్రభాతవార్త**



గవర్నమెంట్ హాస్పిటల్ నందు కె.నరసింహులు అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మేఐహెల్ప్యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు స్పందించి శుక్రవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.

## సంక్రాంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు...

**బద్వేలు అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చెముదూరు యూత్ సభ్యులు ఎల్ఎస్‌పి డ్యామ్ చైర్మన్ ఈగ రమణారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు విజయమ్మ ను, అలాగే బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ కె. రితీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నియోజకవర్గ అభివృద్ధి, యువత సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలకు సేవ చేయడంలో టిడిపి నాయకత్వం చేస్తున్న కృషిని యూత్ సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చెముదూరు యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## టిడిపిలో చేరిన నాగేంద్రరెడ్డి

**కడప కార్పొరేషన్ జనవరి 16 ప్రభాతవార్త:**



కడప నగరంలోని 46వ డివిజన్ శాస్త్రి నగర్‌లో వైఎస్ఆర్సిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై, వై.ఎస్.ఆర్.సి.పి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు శ్రీ మాజీ నాగేంద్ర రెడ్డి తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి వైసీపీని వీడివీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరితో పాటు ప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులు కూడా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి సమక్షంలో వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ కడప నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకత్వంపై నమ్మకంతోనే టిడిపి చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తూ, కడప అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ ఇంచార్జ్ జాకీర్, రామ్ చంద్ర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివరాం, గిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సజ్జలనీ కలిసిన స్థానిక వైసిపి నాయకులు

**పులివెందుల,జనవరి 16 , ప్రభాతవార్త :**



పులివెందులకి విచ్చేసిన వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణ రెడ్డి పర్యటన పులివెందుల రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఆయన రాకతో వైకాపా శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.స్థానిక వైకాపా నాయకులు సజ్జల రామకృష్ణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజ కవర్గంలో పార్టీ పరిస్థితి, కార్యకర్తల సమస్యలు, రాబోయే రాజకీయ పరిణామాలపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి తీసుకో వాల్సిన చర్యలు, ప్రజల మధ్య పార్టీని మరింత బలంగా తీసు కెళ్లే వ్యూహాలపై నాయకుల మధ్య లోతైన మంతనాలు జరిగాయి. ఈ భేటీతో పులివెందులలో వైకాపా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో పులివెందుల మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, రసూల్, సుధీకర్ రెడ్డి, చంద్ర మోళి, నూరుల్లా, ఇరికి రెడ్డి జగన్ రెడ్డి, శ్రీరాములు, షబ్బీర్, ముల్లా బిలాల్‌తో పాటు పలు వురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిల్పారామంలో కనుమ పండుగ సందడి..

**కడప కార్పొరేషన్ జనవరి 16 ప్రభాతవార్త:**



సంక్రాంతి పండుగ సందర్భంగా మూడవరోజు కడప శిల్పారామం కనుమ పండుగ శుక్రవారం జన సమూహముతో కికిరిషి పోయింది. సాయంత్రం 5:30 గంటలకు చిన్నపిల్లలకు గాలిపటాలు ఎగర వేశారు. అనంతరం సాయంత్రం 6:30 గంటలకు మిస్స వారి సహకారంతో చిత్తూరు జిల్లా చెందిన బైరెడ్డిపల్లి రాజేష్ బృందం పల్లె జానపదాలు శాస్త్రీయ నృత్యలు సినీ నృత్యాలతో ప్రేక్షకులను అల్లరించిన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంటినెంటల్ కాఫీ ఆర్ ఎస్ ఎం పూర్ణ చంద్ర రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాల అధికారి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

## సాఫ్ట్‌వెకు మళ్ళీ ప్రాణం పోసాడు..

### యువ వైద్యుడని అభినందించిన ప్రజలు

**వేంపల్లె:జనవరి:16:(ప్రభాత వార్త)**



వేంపల్లెలోని సాయినగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం గాలి పటం ఎగుర వేస్తుండగా గాలిపటం విద్యుత్ వైర్లపై పడి తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ మణికంఠకు విద్యుత్ షాక్ తగిలి కింద పడి పోవడం జరిగింది. దీంతో సెలవులపై ఇంటికి వచ్చిన మహమ్మద్ సోహెబ్ ఘటనను చూసి సమయ స్ఫూర్తితో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి పడి ఉన్న మణికంఠకు సిఆర్‌పి చేయడం వలన శ్వాస పీల్చుకోవడం జరిగింది. దీంతో యువ వైద్యుడైన మహమ్మద్ సోహెబ్‌ను అప్రాంత ప్రజలు అభినందించారు. దీంతో ప్రాణాలు నుండి బయట పడినట్లు నిర్ధారణ చేయడంతో హుటాహుటిన కడప ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఏలూరులోని మెడికల్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ సోహెబ్ సెలవులపై ఇంటికి రావడంతోనే మణికంఠ ప్రాణాలు దక్కినట్లు అప్రాంత ప్రజలు అంటున్నారు. ప్రాణాపాయం నుండి కాపాడిన యువ వైద్యుడికి బాధిత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

## కూటమి పాలనలో రాష్ట్రం మద్యాంధ్ర ప్రదేశ్, జూదాంధ్ర ప్రదేశ్ లా మారింది



**వేంపల్లె జనవరి 16 (ప్రభాతవార్త)**
చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కూటమిపాలనలో రాష్ట్రం మద్యాంధ్ర ప్రదేశ్ గా, జూదాంధ్ర ప్రదేశ్ గా, డ్రగ్గాంధ్ర ప్రదేశ్ గా, గంజాయి ఆంధ్ర ప్రదేశ్ గా తయారు కావడం బాధాకరం, దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి నరెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు అన్న విధంగా రాష్ట్రంలో మద్యం పాలసీ తయారైందని, మద్యం ఏరులై పారుతోందని,ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతుందని, యువత మద్యానికి బానిసలై యువశక్తి నిర్వీర్యం అవుతుందని తులసి రెడ్డి అన్నారు. మూడు జోకర్లు,నాలుగు కళావరులు అన్న రీతిలో రాష్ట్రంలో జూదం జరుగుతోంది, హై స్కూల్ లలో కూడా డ్రగ్స్,గంజాయి దుష్ట సంస్కృతి ప్రవేశించింది. ఈ సంవత్సరం మకర సంక్రాంతి పండుగ మందుబాబుల పండుగగా, తాగుబోతుల పండుగగా,జూదగాల పండుగగా తయారైందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. అనేక చోట్ల కూటమి నాయకుల ఆధ్వర్యంలో,పర్యవేక్షణలో బరులు ఏర్పాటు చేయడం,కోళ్ల పందాలు, మూడుముక్కలాట,లోపల బయట, గుండాట లాంటి జూద క్రీడలు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలు అడ్డు అదుపు లేకుండా జరిగాయన్నారు. సంక్రాంతి పండుగ కొంతమంది కూటమి నాయకులకు ఆదాయ వనరుగా మారిందన్నారు. తాగుడు, జూదము, వేట ఇవన్నీ వ్యసనాల కిందికి వస్తాయి.వీటి జోలికి పోవద్దు అని మహాభారతంలో విదుర దేవుడు చెప్పాడు. కానీ దురదృష్టవశాత్తు రాష్ట్రంలో ప్రభుత్వమే వీటిని ప్రోత్సహించడం శోచనీయం. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతప్పే ప్రమాదం ఉంది.కాబట్టి ప్రభుత్వం పునరాలోచించాలి.

# వాడ వాడవాడాల సంక్రాంతి సంబరాలు

రామసముద్రం జనవరి 16 ప్రభాతవార్త

మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె, మట్లవారిపల్లె, పలుగ్రామాల్లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు గ్రామీణ ప్రాంతాల్లో వేకువ జామునే మహిళలు ఇంటి ముందు పసుపు నీళ్ల చల్లి రంగు, రంగుల ముగ్గులు వేసి మధ్యలో గొబ్బెమ్మలు పెట్టి ఉదయం నుండి ఉపవాస దీక్షలో ఉండి ఆలయాలకు వెళ్లి మొక్కలు చెల్లించుకున్నారు. మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పొయ్యిలో కొత్త మట్టికుండలో పాలు పొంగించి తీపి పొంగల్, పలురకాల పిండివంటలు చేసి, కొత్త అల్లుళ్లకు, బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం పశువులను చెరువులు, కుంటలు దగ్గరకు తీసికెళ్లి శుభ్రంగా కడిగి పశువుల కొమ్ములను శుభ్రపరిచి కొమ్ములకు రంగులు పూసి, రంగుల బట్టలు కప్పి (బురికి )పలు రకాల పుష్పాలు, బెలున్స్ (బుడ్డలు)కట్టి పశువులను అలంకరణ చేసి పశువులకు మహిళలు పూజలు చేసి గ్రామ పురవీధులు గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. పురావీధులు గుండా పశువులు వెళుతుంటే ఆనందంతో యువత కేరింతలు కొట్టారు, డప్పు వాయిద్యాయులతో పశువులను బెదురుపెట్టారు. ఆలయం చుట్టూ పశువులను మూడు ప్రదక్షణాలు చేసి స్థానిక ఆలయాల పూజారులు, శీనప్పు, టి. కృష్ణప్ప పూజలు నిర్వహించి పశువులకు మంగళహారతులు పట్టి పశువులకు ఏజబ్బులు ప్రభలకుండా తీర్థాలు, వేపపిండి, చెక్కతో తయారు చేసిన ముద్దను పశువులకు పూజారులు పంచిపెట్టారు. సాయంత్రం కాటమరాజు గుడికి తీసికెళ్లి రగులుతున్న చెట్లకుప్పలు వేసి రగులుతున్న అగ్గి చుట్టూ పశువులను తిప్పారు, అక్కడ పూజులు చేసిన అనంతరం పశువులను ఇంటికి తీసుకువచ్చి గాటిలో కట్టేసి, ఫలహారాలు, పచ్చిమేత వేసి పశువులకు దిష్టి తీశారు. గ్రామాల్లో హరిదాసులు,మహిళలు గొబ్బియాలో, గొబ్బియాల్లో అంటూ పాటలు పాడుతూ ఇంటి ఇంటా తిరుగుతూ దాన దర్మాలు చేయాలంటూ తిరిగారు. పలుగ్రామాల్లో గ్రామపెద్దలు, యువత మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముగ్గులు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. సంక్రాంతి పండుగ రోజున పల్లెల్లో బంధువులు రాకతో కలకలలాడుతున్న, గ్రామాలు, పట్టణాలు. సంక్రాంతి పండుగపర్వదినం రోజున చిన్న పిల్లల తలపై రేగుపల్లు చల్లి వారికి ఆశీర్వాదములతో దీవించారు. తిరుమల రెడ్డి పల్లె గ్రామం లో యువకులు ఒంగోలు నుండి ఒంగోలు గిత్తను తీసుకువచ్చి పరిగెత్తించారు గ్రామ ప్రజలు వీక్షించి పరవశించారు.



## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పులి సత్యనారాయణ రెడ్డి

పీలేరు జనవరి 16 ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గంలో వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి గ్రామ పంచాయతీ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద జనవరి 17 శనివారం నిర్వహించిన జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమంలో వాల్మీకిపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి సభ్యులు, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. గండ బోయినపల్లి గ్రామంలో నిర్వహించిన జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ జిపిఎల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంభం నిరంజన్ రెడ్డి పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థానాలు సాధించడం సాధ్యమన్నారు. పీలేరు నియోజకవర్గ విద్యార్థులు, క్రీడాకారులు యువకులు గొప్ప ఆశయాలతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన టీంకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల స్థాయి నాయకులు క్రికెట్ క్రీడాకారులు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

## కబడ్డీలో గెలుపొందిన వారికి నగదు పంపిణీ



పెండ్లిమర్రి జనవరి 16 ప్రభాతవార్త:

గ్రామానికి చెందిన కే నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ క్రికెట్ క్రీడాకారులకు శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి క్రీడాకాలకు గెలుపొందిన వారికి నగదు పంపిణీ చేశారు కబడ్డీ గెలుపొందిన వారికి 10000 క్రికెట్ గెలుపొందిన వారికి 20,000 చొప్పున నగదు పంపిణీ చేశారు టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి మాజీ ఎంపీటీసీ నాగ మల్లారెడ్డి బిజెపి నాయకులు బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల పేరుతో

## విచ్చలవిడిగా కోడి పందేలు, జూదం

ప్రొద్దుటూరు, జనవరి 16, ప్రభాతవార్త



సంక్రాంతి సంబరాల పేరుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కోడి పందాలు జూదాన్ని విచ్చలివిడి చేసిందని పైగా కోడి పందేలను జూదాన్ని వినోదంగా పరికరించాలని సీఎం చంద్రబాబు చెప్పడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో సంక్రాంతి సంబరాలు పాలకులకు... అప్పులు, కష్టాలు ప్రజలకు మిగిల్చిందని విమర్శించారు. అని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. సంక్రాంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహిస్తున్న కోడిపందాలు మరియు జూదంలో పేద, మధ్య తంగతి ప్రజలకు శక్తికి మించి జూదంలో పాల్గొని అప్పులపాలై ఆత్మహత్యలకు కారణం కాదా అని ప్రశ్నించారు. మీరు చెప్పిన వినోద కర సంక్రాంతి అంటే తెలుగువారి సంప్రదాయాలను అవలంబించడం అని కోస్తా ప్రాంతంలో సంక్రాంతి మరో గోవాను తలపిస్తుందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి స్వయంగా అండగా ఉంటే పోలీసుల పాత్ర కేవలం ప్రేక్షక పాత్రగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లాలో లేని గోదావరి సంప్రదాయాలు కోడి పందాలు జూదం లాంటి వాటిని జిల్లాకు పరిచయం చేసిన ఘనత తెదేపా నాయకులకే చెల్లుతుందని తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో కీలక పాత్ర పోషించడం మొదలైనప్పటి నుంచి రాష్ట్రం సర్వనాశనం అయిందని మండిపడ్డారు. జగన్ తండ్రిని మించిన తనయుడు అయితే లోకేష్ తన చేతగాని తనంతో తండ్రిని అబాసు పాలు చేసిన తనయుడు అయ్యాడని విమర్శించారు. చంద్రబాబుకు ఎలాగో మంచి పేరు లేదని, ఆ పేరును ఇంకాస్త దిగజార్చిన గొప్పదనం లోకేష్ ది అన్నారు. ఈ సంవత్సర కాలంలో రాష్ట్రం తెదేపా పాలనలో అవినీతిలో ప్రథమ స్థానం లో నిలిచిందని చెప్పడానికి ఏమాత్రం సందేహం లేదని, ఈ సంక్రాంతికి కడపలో ఇప్పటివరకు లేని సాంప్రదాయాన్ని దుర్వ్యసనాలను దగ్గరుండి తెదేపా నాయకులు నడిపిస్తుంటే పోలీసులే ప్రధాన ప్రేక్షకుల్లాగా మిగిలిపోయారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ సంక్రాంతికి జూదమాడి నష్టపోయి ఎవరైనా ఆత్మహత్యలకు పాల్పడితే చంద్రబాబు అలాగే కూటమి ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు.

## ఘనంగా కనుమ పండుగ సంబరాలు



తంబళ్లపల్లె జనవరి 16 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె మండలంలో శుక్రవారం సంక్రాంతి పండుగలో భాగమైన కనుమ పండుగ స్థానిక గ్రామీణ ప్రాంత పాడి రైతులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఏడాది పొడవునా రైతులకు సేద్యంలో సహాయపడిన పశువులు, పాల ఉత్పత్తితో కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడిన పాడి ఆవులను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించి గ్రామాల పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివార్ల లోని చిట్ల కుప్ప వద్దకు పశువులను తీసుకెళ్లి కాటమరాజు విగ్రహానికి పూజలు నిర్వహించి పాడి పశువులు అభివృద్ధి చెంది పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. అనంతరం చిట్ల కుప్పకు నిప్పు పెట్టి ఆ మంటలు చుట్టూ మూడు మార్లు ప్రదక్షిణలు చేయించి పశువులను ఇండ్లకు తరలించారు.

## వాహన చోదకులు రోడ్డు భద్రత పాటించండి

తంబళ్లపల్లె జనవరి 16 ప్రభాతవార్త :

మండలంలోని వాహన చోదకులు కచ్చితంగా రోడ్డు భద్రత పాటించి క్షేమంగా ఇళ్లకు చేరాలని ఎస్సై టి అనిల్ కుమార్ హితబోధ చేశారు. గురువారం సాయంత్రం తంబళ్లపల్లె క్రాస్ రోడ్‌లో వాహన చోదకులకు అవగాహన కల్పించారు. వాహనం డ్రైవర్లు ఒరిజినల్ రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ వాడాలని, అతివేగం, మద్యం సేవించి బండి నడపడం చేయరాదన్నారు. అసాంఘిక కార్యక్రమాలైన జూదం, కోడి పందాలు, సైబర్ నేరాలు, గంజాయి, బెల్ట్ షాప్ నిర్వహణ, బహిరంగ మద్యం సేవించడం, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, బాలికల ఈవిటీజింగ్ లాంటి చర్యలు చేపడితే కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షిస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై మండలంలోని ప్రతి గ్రామంలో విస్తృతంగా మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని ప్రజలు సైతం సహకరించి ఈ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి నేర రహిత సమాజం కోసం తమతో కలసి రావాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో పోలీస్ స్టేషన్ సిబ్బంది, వాహనం డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.



## జగన్ పాలనలో యువతకు పెద్దపీట

చిన్నమండెం జనవరి 16 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన చిన్నమండెంలో యువకులు, వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు,నాయకులతో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఆశ, శ్వాస యువతేనని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిన్నమండెంలో యువకులు, వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, నాయకులతో శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సిపి నాయకులు బాబు రెడ్డి, సర్పంచ్ నజీర్ అహమ్మద్, జె సి ఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, బురాన్ ఖాన్, యేహియా ఖాన్, సిబక తుల్లా ఖాన్, మహమ్మద్ తదితర నాయకులు యువత పాల్గొన్నారు.

## రంకెలేసిన గోడెగిత్తలు ఉరకలేసిన కుర్రకారు...!



పొదపల్లిలో ఊరేగుతున్న పశువులు

చౌడేపల్లి, జనవరి 16 ప్రభాతవార్త

కోడె గిత్తలు పౌరుషంతో రంకెలేయగా, కుర్రకారు ఉరకలేసి వాటిని అదుపు చేసేందుకు తంటాలు పడ్డారు. మండల వ్యాప్తంగా పశువుల పండుగను కన్నుల పండుగలా జరుపుకొన్నారు. మండలంలోని శెట్టిపేట, పొదలపల్లి, చారాల, ఒదులపేట, దిగువపల్లి, కొలింపల్లి తదితర గ్రామాల్లో పశువుల పండుగను జరుపుకొన్నారు. ఈక్రమంలో ఉదయాన్నే ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు విశేష పూజలు జరిపారు. అనంతరం పశువులును అందంగా అలంకరించి ఊరేగించారు. ఇళ్ళముందు రంగురంగుల ముగ్గులతపాటు ఆటపాటల్లో మహిళలు మునిగి పోయారు.

## పేదలకు, కోళ్లు, నగదు పంపిణీ

సిద్ధవటం,జనవరి16 ప్రభాతవార్త



పేద ఎస్సీ ఎస్టీ బలహీనవర్గాల కుటుంబాలకు శుక్రవారం, కనుమ పండుగ సందర్భంగా కోళ్లు, నగదు పంపిణీ చేపట్టారు ఈ సందర్భంగా, జనసేన పార్టీ నేత, పసుపులేటి గంగయ్య మాట్లాడుతూ ప్రతి పేదవాడు పండుగ చేసుకునే విధంగా జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి, కృష్ణ ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన, సిద్దోటంలోని, ఎస్సీ, ఎస్టి, బంధారుపల్లె పేద బలహీన వర్గాల, 250 కుటుంబాలకు పైబడి గృహ నివాసులకు నగదు, కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు, చెంచులక్ష్మి యానాది కాలనీ నివాస ప్రజలు మాట్లాడుతూ మాకు అన్ని విధాలుగా సహాయ కార్యక్రమాలు చేస్తున్న పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ సేవలు ఎప్పటికీ మరువలేమని, శుభ కార్యక్రమాలకు మా కాలనీలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తో బాధపడే వారికి ఆయన అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో, జనసేన పార్టీ నేతలు విజయ్, షేక్ మహబూబ్ బాషా, పి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగారెడ్డి పల్లె గ్రామంలో ఘనంగా ఆటల పోటీలు

పోరుమామిళ్ల రూరల్, జనవరి 16 ప్రభాత వార్త:



మండలంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా, లింగారెడ్డి పల్లి గ్రామంలో దాతలు బసిరెడ్డి. జయరాంరెడ్డి వారి ధర్మపత్ని వెంకటమ్మ, దాతృత్వంతో ముగ్గుల పోటీలు మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ రేస్, లెమన్ స్పూన్, అలాంటి ఆటలతో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మ్యూజికల్ చైర్స్ ఆటలు ఆడిన 25 మంది మహిళల్లో ప్రథమ, ద్వితీయ, రెండు బహుమతులను, అలాగే ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులను ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ రంతు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తెలుగుదేశం పార్టీ నాయకుడు, బసిరెడ్డి, జయరాంరెడ్డి, కాంట్రాక్టర్ ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి ఓల్డ్ హోమ్‌లో పండ్ల పంపిణీ

కలసపాడు, జనవరి 16 ప్రభాతవార్త:




మండలంలోని కలసపాడు గ్రామంలో ఉన్న పద్మావతి ఓల్డ్ హోమ్ (సేవాశ్రమం)లో గురువారం సంక్రాంతి పురస్కరించుకుని ఐటీ వింగ్ ప్రెసిడెంట్ బాసిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అవ్వతాతలకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, వృద్ధులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆశ్రమాల్లో ఏవైనా వసతుల లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే, తన శక్తిమేర సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వృద్ధులతో వారి ఆరోగ్యం, బాగోగుల గురించి మాట్లాడి కొంతసేపు ముచ్చటించారు. ఈ విధంగా వృద్ధులతో గడపడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. పుట్టినరోజులు, పెళ్లిరోజుల వంటి సందర్భాల్లో అనవసర ఖర్చులు చేయకుండా అభాగ్యులకు పండ్లు, ఆహారం పంచడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, తిరుపాల రెడ్డి, క్రిష్ణరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీవాసులకు దుప్పట్లు పంపిణీ

కేవీ పల్లె జనవరి 16 ప్రభాతవార్త:



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గిరిజన సంఘ నాయకులు

కంబిరెడ్డిగారిపల్లి గిరిజన కాలనీ వాసులకు శుక్రవారం ఏపిజివైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ నిర్వహించారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీలో నివసిస్తున్న నిరుపేద గిరిజన కుటుంబాలకు అవసరమైన దుప్పట్లను అందజేశారు. ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ఏపిజివైఎస్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుమల శెట్టి రమణ ఆర్థిక సహకారం అందించడంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించగలిగామని నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపిజివైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన సహాయాన్ని అందించడమే తమ సంఘం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిజివైఎస్ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్, తిరుపతి శివకుమార్, సుశీల రమణ, తదితర నాయకులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు. దుప్పట్లు అందుకున్న గిరిజనులు సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా రక్తదానం విజయవంతం చేయండి

చిన్నమండెం జనవరి 16 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 30 వర్థంతి సందర్భంగా రాయచోటిలో జరుగుతున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని టిడిపి యువకులు శుక్రవారం పోస్టర్లను విడుదల చేసి పురవీధుల్లో అతికించారు ఈ సందర్భంగా యువ నాయకుడు తోహిద్ ఖాన్ మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడినవారమైతామన్నారు.

## మల్లయ్య కొండలో కోలాటాలు.

తంబళ్లపల్లె జనవరి 16 ప్రభాతవార్త :



మండల కేంద్రం సమీపంలోని మల్లయ్య కొండలో సంక్రాంతి పండుగ సందర్భంగా వందలాదిగా భక్తులు మల్లికార్జున స్వామి కి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో చెక్కభజనలు, కోలాటాలు, పండరి భజనలు నిర్వహించి అలరించారు. గురువారం రాత్రి కళాకారులు శివనామస్మరణ తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా మల్లయ్య కొండకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో మల్లయ్య కొండ భక్తులతో కిటకిటలాడింది. అదేవిధంగా కోసువారిపల్లి శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం, చంద్రమోలేశ్వరాలయం, తంబళ్లపల్లి కోదండ రామాలయం, శివాలయం, సాయిబాబా ఆలయం, గంగిరెడ్డిపల్లి మద్దెమ్మ ఆలయం, కుక్క రాజుపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ప్రొద్దుటూరు జనవరి 16 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణం నెహ్రూ రోడ్డులోని డాక్టర్ మునిరెడ్డి వీధిలో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌటూరు పూర్ణ చందు సహకారంతో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి మాజీ ఇంచార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి సోదరి హరిత రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి అనగా మహిళలకు ఎంతో విశిష్టమైనది అన్నారు వీధులన్నీ ముగ్గులతో అలంకరింపబడి ఉంటాయన్నారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలైన ప్రథమ ద్వితీయ తృతీయ మహమ్మతులను ఆమె అందజేశారు. అలాగే ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు ప్రథమ బహుమతి విజయలక్ష్మి అందుకోగా ద్వితీయ బహుమతి సరస్వతి తృతీయ బహుమతి వరలక్ష్మిలు హరిత రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, దేవిక, లక్ష్మీదేవి, భారతి మరియు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## గొల్లపల్లెలో గ్రామోత్సవం

దువ్వూరు, జనవరి 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం సంక్రాంతి వేడుకల సందర్భంగా శ్రీ సీతారాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లె, చల్లబసాయి పల్లె, చిన్నసింగన పల్లె గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కాయ, కర్పూరాలు స్వీకరించారు.



## ఎస్‌సి, ఎస్‌టిలకు కూటమి ప్రభుత్వంలోనూ అన్యాయమే

వీసీకే పార్టీనేత పిటిఎం శివప్రసాద్ ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

మదనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త :

ఎస్‌సి, ఎస్‌టిలకు కూటమి ప్రభుత్వంతోనూ అన్యాయమే జరుగుతోందని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కి ఎస్‌సి, ఎస్‌టిలకు ద్రోహం చేస్తోందని తెలిపారు. వైకాపాను దింపి తెదేపాను అధికారంలోకి తెప్పిస్తే ఎస్‌సి, ఎస్‌టిలకు 27పథకాలను పునఃప్రారంభించి కార్పోరేషన్‌లకు పెద్దఎత్తున నిధుల కేటాయిస్తామని, సబ్‌ప్లాన్‌నిధులు దారి మళ్లించడంపై విచారణ చేస్తామని, సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతామని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని ఇలాంటి మరెన్నో హామీలను అమలుచేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను తుంగలో తొక్కి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు గత వైకాపా ప్రభుత్వం పథకాలు అమలు చేయడంలో విఫలం చెంది ద్రోహం చేసినందుకే 2024 ఎన్నికల్లో తెదేపా గెలుపుకు ఓట్లు వేశారని గుర్తు చేశారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని లేకుంటే కూటమిపార్టీలు ఎస్‌సి, ఎస్‌టిల ఆగ్రహానికి గురికాక తప్పదని శివప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ పట్టణ అధ్యక్షులు బురుజు రెడ్డిప్రసాద్, నాయకులు సొన్నికంటి రెడ్డప్ప, జివి.రమణ, బండకోట రవి, రవిశంకర్, రాయల్‌సూరీ తదితరులు పాల్గొన్నారు.

## ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణప్ప

మదనపల్లె, జనవరి 16 ప్రభాతవార్త :



ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోపు క్రిష్ణప్ప తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రిష్ణప్ప మాట్లాడుతూ ఈనెల 18న ఖమ్మంలో బహిరంగసభ జరుగుతోందని ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసంగాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు,త్యాగాలు ఎంతో మంది అమరవీరుల రక్తతర్పణంతో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొందన్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట రైల్వేకోడూరు నాయకులు ఖమ్మంవచ్చేవారు శనివారం సాయంత్రం 7.30గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలని, తంబళ్ళపల్లె నియోజకవర్గంనుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు సాయంత్రం ఏడు గంటలకు చేరుకోవాలని తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్గం

రామసముద్రం జనవరి 16 ప్రభాతవార్త




పుంగనూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలోని రామసముద్రం మండలం కురిజల గ్రామంలో శుక్రవారం సమయం సుమారు 2 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే సిబ్బందితో ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి కె.రామాచారి, తండ్రి కె. లింగాచారి, సి. హనుమంతు, తండ్రి సి. సుబ్బన్న అనే రైతుల వరిగడ్డివాములు, రాతి కూసాలు, పందిరి కొయ్యలు అగ్ని ప్రమాదానికి గురైనది. అక్కడి గ్రామ ప్రజలు సహాయముతో అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేయడం జరిగింది. చుట్టుపక్కల నివాస గృహాలకు అగ్ని వ్యాపించకుండా నిరోధించడం జరిగింది. ఇరువురి ఆస్తి నష్టము సుమారు రూపాయలు 80,000 వరకు ఉండొచ్చు ,ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ గ్రామ స్థులు కథనం మేరకు ఈ అగ్ని ప్రమాదానికి కారణం ప్రక్కన గ్రామంలో ఒకరు మరణించిన వారి దహన క్రియలు నిమిత్తము టపాకాయలు కాల్చినప్పుడు అవి గడ్డివాములపై పడి అగ్ని ప్రమాదం జరిగినట్లు అక్కడ ప్రజలు తెలియజేశారని . ఈ అగ్నిప్రమాదమునందు పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది పాల్గొనడం జరిగిందన్నారు . ఈ అగ్ని ప్రమాదమునందు పాల్గొన్న సుబ్రహ్మణ్యం, వి. లక్ష్మీనారాయణ, ఎం. లోకేష్ రెడ్డి, వి.కేశవ, వినోద్ కుమార్ పాల్గొన్నారు .గ్రామపెద్దలు మాజీ జడ్పీటీసీ ముని వెంకటస్వామి, గ్రామస్థులు మాట్లాడుతూ పుంగనూరు నుండి మాగ్రామం వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని దాని వల్ల 15 నిముషాలు లేటుగా అగ్నిమాపాక వాహనం వచ్చిందని ఆయన అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్డు మరమ్మత్తులు చేయాలని అన్నారు.

## ఆరాధన మహోత్సవంలో శ్రీకాంత్‌రెడ్డి



చిన్నమండెం జనవరి 16 ప్రభాతవార్త:

మండలం లోని చినర్సుపల్లె గ్రామంలోని శ్రీ పీరయ్య స్వాముల వారి మఠంలో గురువారం నుంచి జరుగుతున్న శ్రీ శ్రీ సద్గురు చిన్నమండెం పీరయ్య స్వాములవారి 220వ ఆరాధన మహోత్సవాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం నిర్వాహకులు పీరయ్య స్వామి, ప్రసాద్ స్వామి, సిద్ధయ్య స్వామి, శ్రీను స్వామి ఆధ్వర్యంలో శ్రీకాంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేసి దుస్సాలువలతో సత్కరించారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ చిన్నమండెం పీరయ్య స్వాముల వారి మహిమలు, లీలలు అపారమైనవని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ మఠం విరాజిల్లుతోందని పేర్కొన్నారు. అనంతరం మఠానికి సంబంధించిన వంశీయులతో ఆయన మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు బాబు రెడ్డి, తిమ్మారెడ్డి, చుక్కా అంజనప్ప, నాగశేషారెడ్డి, దామోదర్, నరసింహులు, వెంకట రాయుడు, అంజి, జయశంకర్ రెడ్డి, రమణయ్య, డా. పెద్దిరెడ్డి, తిరుపతి నాయుడు, నరేష్ నాయుడు, ధనాంజనేయులు, గోవర్ధన్, రాఘవ, విష్ణు, కుమార్, వెంకట రెడ్డి, వేణుగోపాల్, పుల్లమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి పండుగ

చిన్నమండెం జనవరి 16 ప్రభాతవార్త:



మండలంలోని అన్నిగ్రామాలలో సంక్రాంతి పండుగను ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి వివిద రకాల పూలతో అలంకరించారు. భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకొన్నారు. శుక్రవారం కనుమ పండుగ సందర్భంగా రైతులు పశువులను సుందరంగా అలంకరించి గొప్ప వేడుకగా డప్పు వాయిద్యాలు,బాణసంచా పేలుళ్ళ మధ్య మెరవని తీసి చిట్లాకుప్పలకు నిప్పంటించి ప్రదక్షణలు చేసారు.ప్రతి ఇంటిలో రక రకాల వంటలతో బంధు మిత్రులతో కలసి ఆనందంగా జరుపుకొన్నారు.

# గాంధీనగర్‌లో వైభవంగా సంక్రాంతి వేడుకలు

: పారువేట వెంట భారీగా తరలి వచ్చిన మహిళలు :అలరించిన శ్రీ కృష్ణ కోలాటం సాంస్కృతిక కార్యక్రమం





**బద్వేలు అర్బన్, జనవరి 16 (ప్రభాతవార్త):**

బద్వేలు మున్సిపాలిటీ పరిధి సిద్దవటం రోడ్డు గాంధీనగర్‌లో వార్డు ప్రజలందరూ పార్టీలకు కుల, మతాలకు అతతంగా సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గౌరమ్మకు పలువురు మహిళలు భక్తి, శ్రద్దలతో వివిధ రకాల పూజలు నిర్వహించి ఇక సెలవమ్మా గొబ్బెమ్మా అంటూ గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. గౌరమ్మ వెంట వందలాది మంది మహిళలు, భక్తులు శ్రీకృష్ణ కోలాటం మాస్టర్ వెంకీ చే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా గౌరమ్మ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం వార్డు ప్రజలు భూమిరెడ్డి ఓబుళరెడ్డి, నిమ్మకాయల శేఖర్‌రెడ్డి, మాచుపల్లె కృష్ణారెడ్డి , లక్ష్మిదేవి, యల్లారెడ్డి, సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, ఆర్టీసీ డ్రైవర్ నాగిరెడ్డి, మరియు పలువురు మహిళల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే బద్వేలు పట్టణంలోని 35 వార్డులలో అనేక చోట్ల సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహిస్తూ గౌరమ్మ నిమజ్జన కార్యక్రమం చేపట్టారు.

## ఘనంగా శ్రీ సీతారాములు పార్వేట మహోత్సవం



**ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త**

మండల పరిధిలోని చెన్నమరాజు పల్లె గ్రామంలో శుక్రవారం శ్రీ ఆత్మరామ స్వామి దేవాలయంలోని శ్రీ సీతారామ ఉత్సవ విగ్రహాలను అలంకరించి గ్రామ వీధుల గుండా కేరళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొని స్థానిక స్కూలు వద్ద కుందేలు పిల్లను వదిలి పారువేట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ రాజువారి వెంకట సుబ్బయ్య, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు అందించారు.

## రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ను సన్మానించిన జిల్లా కోర్టు జిపి



**ఒంటిమిట్ట జనవరి 16 (ప్రభాతవార్త )**

సీనియర్ న్యాయవాది రవి యాదవ్ రాష్ట్ర పౌర సమాచార హక్కు కమిషనర్ గా ఎన్నికైన నేపథ్యంలో జిల్లా ఇన్చార్జ్ గవర్నమెంట్ ప్లీడరు (జి. పి) ఆదినారాయణ రావు శుక్రవారం ఆయనను కలిసి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జి.పి. ఆదినారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగంలో సుదీర్ఘకాలం పనిచేసి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హోంశాఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గవర్నమెంట్ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన వాదనలతో ఎన్నో కేసులను పరిష్కారం చేస్తున్న రవి యాదవ్ ను రాష్ట్ర పౌర సమాచార హక్కు కమిషనర్ గా ప్రభుత్వం ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు ఆయనను నియమించడంపై తోటి న్యాయవాదులందరూ సంతోషిస్తున్నట్లు స్పష్టం చేశాడు. రవి యాదవ్ రాష్ట్ర సమాచార హక్కు కమీషనర్ గా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంతో ఉన్నతంగా ఎదగాలంటూ ఆదినారాయణరావు కోరడం జరిగింది.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో

## మదనపల్లె విద్యార్థికి పతకాల పంట



**మదనపల్లెక్రైమ్, జనవరి 16 ప్రభాతవార్త.**

స్కాయ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లెకు చెందిన యువ కరాటే క్రీడాకారుడు మజహర్ అలీ అద్భుత ప్రతిభ కనబరిచి పట్టణానికి గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఈ జాతీయ స్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి మజహర్ అలీ అండర్18 విభాగంలో పాల్గొని తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మొత్తం మూడు విభాగాల్లో పతకాలను కైవసం చేసుకున్నాడు. గ్రూప్ ఈవెంట్ విభాగంలో ద్వితీయ స్థానం, డబుల్ మిక్స్ ఈవెంట్ లో ద్వితీయ స్థానం, వ్యక్తిగత ఈవెంట్ విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. జాతీయ స్థాయిలో రాణించి కళాశాల పేరును నిలబెట్టినందుకు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర లు మజహర్ అలీని ప్రత్యేకంగా అభినందించారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేత గంగిరెడ్డిపల్లి జట్టు

**తంబళ్లపల్లె జనవరి 16 ప్రభాతవార్త :**

మండలంలోని గంగిరెడ్డిపల్లి లో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్లో గంగిరెడ్డిపల్లి జట్టు విజేతగా నిలిచినట్లు టిడిపి సీనియర్ నేత భాస్కర్ నాయుడు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ లో రేకలకుంట తాండ జట్టుపై గంగిరెడ్డిపల్లి జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్ విజేతకు భాస్కర్ నాయుడు ఐదువేలు నగదు తో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు మూడు వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులను అభినందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత దుర్వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులతో పాటు జన్మభూమి, రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గంగిరెడ్డిపల్లెలో తరచూ క్రీడలను ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తున్న భాస్కర్ నాయుడును యువ క్రీడాకారులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మస్తాన్ రెడ్డి, చాంద్ భాషా, చంద్రశేఖర్ నాయుడు, పంచాయతీలోని క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.



## బి.ఎన్.ఆర్ సాగర్‌కు జాతీయ సర్వోత్కృష్ట సేవా పురస్కార్'



**బద్వేలు అర్బన్, జనవరి 16, ప్రభాతవార్త**

రాష్ట్రీయ మరాఠా సేవా సంఘ్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర జాల్నా జిల్లా సింధ్ ఖేడ్ రాజాలో రాజమాత జిజావు జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో బద్వేల్ కు చెందిన స్వరాజ్య భూషణ్, మరాఠా రత్న డా. ఎం.కే. బి.ఎన్.ఆర్ సాగర్‌కు సర్వోత్కృష్ట సేవా పురస్కార్" జాతీయ అవార్డు ప్రదానం చేశారు. అలాగే ఆయనను దక్షిణ భారత ఉత్తమ అధ్యక్షుడిగా) ఎంపిక చేసి ఘనంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ భారత కార్యాధ్యక్షులు డా. సోపాన్ క్షీర సాగర్ మాట్లాడుతూ, రాజమాత జిజావు జయంతి మరియు జిజావు సృష్టికార్యక్రమంలో దాదాపు 14 లక్షల మంది రాజమాత జిజావు, శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజు అభిమానులు, భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరాఠా సేవా సంఘ్ వ్యవస్థాపకులు శ్రీ పురుషోత్తం ఖేడేకర్, జాతీయ అధ్యక్షులు కామాజీ పవార్, దక్షిణ భారత కార్యాధ్యక్షులు శ్రీ సోపాన్ క్షీర సాగర్, శ్రీ శివాజీ పాటిల్, నవీన్ గాడ్గే, మణి కిరణ్ కాలే, సంతోష్ థాకరే తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా పశువుల పండగ



పశువులను ఊరేగిస్తున్న దృశ్యం

**కురబలకోట, జనవరి 16 ప్రభాతవార్త :**

కురబలకోట మండలంలో పశువుల పండగ వైభవంగా చేశారు. సంక్రాంతిని పురస్కరించుకొని పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు వేసి పూలు, గాలిబుడ్డలతో అలంకరించారు. అనంతరం వాటికి పూజలు నిర్వహించారు. మండలంలోని కురబలకోట, జంగావారిపల్లె, అంగళ్ళు, ముదివేడు, మొలకావారిపల్లె, తెట్టు, ముదివేడు, మట్లివారిపల్లె తదితర గ్రామాల్లో వేకువజామునే ఆడపడుచులు ఇంటిముందు గొబ్బెమ్మలు పెట్టి రంగురంగుల ముగ్గులను వేశారు. ఉపవాసాలు ఉండి పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వేకువజామున బోగిమంటలు వేసుకొన్నారు. గురువారం ఉపవాసాలతో ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించారు. అదే రోజు మహిళలు ప్రత్యేకంగా పొయ్యిలు ఏర్పాటు చేసి పాలు పొంగించి తీపి పొంగళ్ళు చేశారు. పొంగళ్ళను అందరికి పంచిపెట్టారు. పలు రకాల పిండి వంటలను వండి ఆరగించారు. పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను రంగులతో కొమ్ములను అలంకరించి, బుడ్డలు కట్టారు. గ్రామం పురవీధుల్లో బాజా భజంత్రీలు, బళ్ళారిడ్రమ్స్ లతో ఊరేగింపుగా తీసుకెళ్ళారు. సాయంత్రం కాటంరాజు గుడికి తీసుకెళ్ళి అక్కడ చిట్లా కుప్ప దగ్గర ప్రదర్శనలు చేయించి అనంతరం అక్కడ పూజలు నిర్వహించుకొని ఇంటికి చేరుకొని అలంకరణలో ఉన్న పశువులను గాటిల్లో కట్టి పచ్చిమేత వేశారు. మహిళలు గొబ్బియాల్లో..గొబ్బియాల్లో అంటూ ఇంటింటా వెళ్ళి దానధర్మాలు చేయాలని పాటలు పాడారు. దూడూ బసవన్నను అక్కడక్కడా తిప్పారు. ఈ పండగ అత్యంత వైభవంగా నిర్వహించుకొన్నారు.

## లోకం సుభిక్షం కోసం క్షత్రియుల హోమాలు



కొత్తవీరపల్లిలో హోమాధి కార్యక్రమాల దృశ్యం

**చౌడేపల్లి, జనవరి 16 ప్రభాతవార్త**

గ్రామ ప్రజలు, లోకమంతా చల్లగా వుండాలని క్షత్రియులు యజ్ఞ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. చౌడేపల్లి పరిధిలోని కొత్తవీరపల్లిలో దాదాపు 40 క్షత్రియ కుటుంబాలు నివశిస్తున్నాయి. కొన్నాళ్ళుగా గ్రామంలో అశకనాలు జరుగుతున్నాయని ఊరంతా కలసి ఒకనిర్ణయానికి వచ్చారు. దోషనివారణ కోసం గ్రామంలో హోమాధి కార్యక్రమాలు చేయాలని తలచారు. దీంతో శృంగేరీ అనుబంధ వేదపండితులచే క్షత్రియుల ఆధ్వర్యంలో హోమాలు, అష్టదిగ్బంధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో నాగ దోష నివారణ పూజలు, శ్రీరామాలయం ఎదుట గురు, వినాయక పూజలు, చండీహోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముఖ్యంగా మహిళలు ఆయా కార్యక్రమాల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. యజ్ఞాలు, హోమాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కార్యక్రమం జరిగిన 3రోజులపాటు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు. గ్రామంలోని క్షత్రియులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సదుం జనవరి 16 ప్రభాతవార్త**

మండల పరిధిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిసాయి. మండల పరిధిలోని తిమ్మానయన పల్లి పంచాయతీ కొర్లకుంటవారిపల్లె, గొంగి వారి పల్లెల్లో గ్రామస్తులు వివిధ రకాల ఆటలు, నృత్యాలు, పాటలు పద్యాలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామాల్లో పశువులను అలంకరించుకొని ఊరేగింపుగా చిట్ల కుప్ప వద్దకు తీసుకువెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పశువులను ఇళ్లకు తీసుకొని వచ్చి పూ జలు చేశారు. ఇందులో భాగంగా ఎర్రాతి వారి పల్లెలో జరిగిన ఉత్సవాలలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ,రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లె ఎ మ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, గోవులకు పూజలు నిర్వహించారు. తాటిగుంట పాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శ్రీనివాస్ రెడ్డి క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.



# కనువిందు చేసిన "కనుమ" పండుగ



పీలేరులో చిట్లాకుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో పశువులు

**పీలేరు జనవరి 16 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల రైతులు కనుమ పండుగను కనువిందుగా జరుపుకున్నారు. రైతులు తమ పశువులను చక్కగా అలంకరించి శుక్రవారం సాయంత్రం స్థానిక కామాటంవారిపల్లి సమీపంలోని జడ్జి క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప దగ్గరకు తీసుకువచ్చారు. దానికి ముందుగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే అందంగా అలంకరించి, సౌష్టవంగా ఉన్న ఆవులు, ఎద్దులకు కూడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ధర్మకర్త కెంపుల శ్రీనివాసమూర్తి కాటమ రాజుకు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి చిట్లాకుప్పకు నిప్పు పెట్టారు. కనుమ పండగకు హాజరైన భక్తులకు ఆయన దాతల సహకారంతో తీర్థ, ప్రసాదాలు పంపిణీతో పాటు భోజన ఏర్పాట్లు కూడా చేశారు. ఈ కనుమ పండుగను పీలేరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలు, మండల పరిధిలోని అనేక చోట్ల రైతులు ఎంతో భక్తి శ్రద్దలతో ఆసక్తిగా ఆచరించారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా పీలేరు పోలీసులు ముందస్తుగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను తిలకించడానికి పట్టణానికి చెందిన వేలాది మంది భక్తులు, ప్రజలు హాజరయ్యారు. అదేవిధంగా పీలేరు పట్టణ శివారులోని శ్రీనాథపురం కాలనీలో పోతం శెట్టి కుటుంబీకులు తరతరాలుగా నిర్వహించుకు వస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా పశువుల పండుగను సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేసి చిట్లా కుప్పకు ఆనవాయితీగా నిప్పు పెట్టారు. వచ్చిన రైతులు, ప్రజలు, భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

## గోవు సర్వదేవతా స్వరూపమే..



**బ్రహ్మంగారిమ్మఠ జనవరి 16 ప్రభాతవార్త:**

గోవు అనేది సర్వ దేవతా స్వరూపమని,గోమాతను పూజిస్తే దేవతలందరినీ పూజించినట్లు అవుతుందని విశ్రాంత అధ్యాపకులు చాపాటి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా వారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠం లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నందు శుక్రవారం గోపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.గో ప్రదక్షిణం చేయడం అనేది భూ ప్రదక్షిణం తో సమానం అన్నారు.గోవు మహాలక్ష్మికి కోటి దండాలు అంటూ భక్తితో భక్తులు పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో అధికంగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.మఠం దేవస్థానం అర్చకులు ఆంజనేయులు ఈ పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు చెన్నారెడ్డి,నాగిరెడ్డి శ్రీనివాసులు,ముండ్లపాటి చంద్రశేఖర్, రాజా, సుంకు సుబ్బారావు, ముచ్చర్ల బాలాజీ, పద్మజ, ఈశ్వరమ్మ, హర్షిత, తన్మయి అధికంగా భక్తులు పాల్గొని గోప్రదక్షిణం చేశారు.

## మల్లూరమ్మా చల్లంగా చూడమ్మా



**చిన్నమండెం జనవరి 16 ప్రభాతవార్త:**

మండలంలోని మల్లూరు గ్రామం మాండవ్య నది ఒడ్డున వెలసిన మహిమాన్వితురాలు మల్లూరమ్మ దేవతకు శుక్రవారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జంతుబలులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో మొక్కుబడులు ఉన్న భక్తులు పెద్ద ఎత్తున కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మల్లూరమ్మా చల్లంగా చూడమ్మా అంటూ మొక్కుకున్నారు. అర్చకులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించారు.



## వైభవంగా శ్రీ చెన్నకేశవ స్వామి పారువేట ఉత్సవం

**రాజుపాళెం, జనవరి 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో గల మూలవిరాట్ శ్రీ చెన్నకేశవ స్వామి, భీమలింగేశ్వర స్వామి పారు వేట ఉత్సవం సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం ఉత్సవ కమిటీ చైర్మన్ జి.ఎల్ నారాయణ రెడ్డి, ఈవో వెంకటరమణ ఆధ్వర్యంలో వెల్లాల, గోపల్లె మల్లెవేమల, దద్దనాల, పగిడాల, కుమ్మర పల్లె, పర్లపాడు గ్రామాల్లో వైభవంగా జరిగినది. శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ చెన్నకేశవ స్వామి, గంగా పార్వతీ సమేతంగా భీమలింగేశ్వర స్వామి వార్ల పార్వేట ఉత్సవం సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని సాగిన పారువేట ఉత్సవం గ్రామ గ్రామాన ప్రత్యేక ఆహ్వానాలతో విశేష పూజలతో, భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గోపల్లె గ్రామ భక్తులు ధనుర్మాస వ్రతమును పాటించి తిరుప్పావై పాశురాలను ఆలపిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆహ్వానం పలుకుతూ గ్రామంలోనికి గొప్ప ఊరేగింపుగా వెళ్లటం ఎంతగానో అలరించినది. ఈ పారువేట ఉత్సవ కార్యక్రమంలో సీఐ నాగభూషణం, ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెక్కభజన, మహిళల కోలాటం, భక్తజనుల భజనలతో ప్రత్యేక పూజలతో ఉత్సవమును ఘనంగా జరుపుకున్నారు. ఈ పార్వేట ఉత్సవంలో మాజీ జెడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి, ఉక్కు ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అబ్బరాతి వీధిలో ఘనంగా గొబ్బెమ్మ ఊరేగింపు



**బద్వేలు, జనవరి 16, ప్రభాతవార్త**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతి వీధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి, పోలేరమ్మ దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన గొబ్బెమ్మకు గత 3 రోజులుగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పాడిపంటలతో, పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, ఆరాధనలు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గొబ్బెమ్మను పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో, యువత, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు. ఊరేగింపు అనంతరం దేవాలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గొబ్బెమ్మను నిమజ్జనానికి తరలించగా, భక్తులు జయజయ ధ్వానాలతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## కనుమ ఉత్సవాల్లో పశువుల ఊరేగింపు



పశువులను ఊరేగింపు చేస్తున్న దృశ్యం

**పెద్దమండెం జనవరి 16 ప్రభాతవార్త**

సంక్రాంతి సంబరాలు భాగంగా శుక్రవారం కనుమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు పశువులను ముస్తాబు చేసి అందంగా అలంకరించి పూలమాలలు ఊపరి బుడ్డలు గజ్జలు తో భారీగా అలంకరించారు అనంతరం వానసంచ పేలుళ్ల మధ్య డప్పు వైద్యాలతో ప్రవీదుల గుండా ఊరేగింపు గావించారు అనంతరం చిట్ల కుప్ప దగ్గరికి ఊరేగిపుగా తీసుకెళ్లి పూజలు నిర్వహించారు పశువులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో శునకాలను గొర్రెలను మేరవని గావించారు చెట్ల కుప్ప కు వెలిగించి పశువులను బెదిరించారు అనంతరం జిల్లాకుప్పలో గుమ్మడికాయలను వేశారు పశువులకు ప్రతి సంవత్సరం ఈ సంక్రాంతి ఉత్సవాలు వాటికి ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు ఈ కనుమ ఉత్సవంతో సంక్రాంతి సంబరాలు ముగుస్తాయి ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు సంతోషంగా పాల్గొని ఉత్సవాలను సంబరాలు జరుపుకున్నారు.

## వైభవంగా గ్రామోత్సవం



**దువ్వూరు, జనవరి 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా చివరి రోజైనా శుక్రవారం అత్యంత వైభవంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పాత దువ్వూరులోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయం నందు గల శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను పల్లకిపై ఉంచి ఊరేగింపుగా పుల్లారెడ్డిపేటలోని కాలేజీ గ్రౌండ్‌లోకి తీసుకొని వెళ్లి అక్కడ పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. అక్కడ పూ జలు, అభిషేకాలు నిర్వహించి కుందేలును వదిలారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరిగి వైభవంగా ఇంటింటికి వెళ్లి ప్రజల నుండి కా య, కర్పూరాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, దేవదా య శాఖ కార్యనిర్వహణ అధికారి పాల్గొన్నారు.

## వైభవంగా కోదండరాముని పార్వేట

**ఒంటిమిట్ట జనవరి 16 (ప్రభాతవార్త )**

సంక్రాంతి పండగ పురస్కరించుకుని కనుమ పండుగ సందర్భంగా టిటిడి పరిరక్షణలో అర్చకులు శ్రీ కోదండ రామస్వామి పార్వేట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది. కనుమ పండుగ సందర్భంగా ఉదయం అర్చకులు శ్రీ సీతారామ లక్ష్మణ మూల మూర్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. పారువేటలో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో అద్భుతంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను కావించి ఆలయ పరిసర భాగంలోని నాగేటి తిప్ప వద్దకు ఉత్సవంగా స్వామివారలను తీసుకుపోయి ఉభయదారుల సమక్షంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో గ్రామస్తులు పాల్గొని యధాశక్తిగా స్వామివారికి టెంకాయ తాంబూలం కర్పూరము నోసంగి పారువేట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టీటీడీ సిబ్బంది ,భక్త జన సమూహం పాల్గొన్నారు.

